**SRINIVASA BALABHARATI - 96**
***(Children Series)***

**SAYANACHARYULU**

*By*

***A.Someswara Sarma***

T.T.D.Religious Publications Series No.: 951

© All Rights Reserved

First Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*

Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 96**

# సాయణాచార్యులు

రచన
**అప్పల సోమేశ్వర శర్మ**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయగలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే "శ్రీనివాస బాలభారతి" అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.



కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

## ఒక్క మాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.



తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# సాయణాచార్యులు

సాయణాచార్యులు విజయనగర సామ్రాజ్య మూల పురుషులలో ఒకరు. వేదవేత్త, శాస్త్రనిధి, రాజనీతిజ్ఞుడు, మహాయోధుడు. హిందూధర్మం యొక్క పునరుజ్జీవనానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి. క్రీస్తుశకం పదునాలుగవ శతాబ్దంలో ఉన్నవాడు.

మానవుడు అన్నివిధాలా వికాసాన్ని, అభివృద్ధిని పొందడానికి సాయపడే నియమనిష్ఠలను ధర్మం అంటారు. ధర్మం ప్రపంచస్థితికి మూలకారణం అనీ, ధర్మమే మానవుని మనుగడను తీర్చిదిద్దుతుందనీ అనేక రీతుల్లో ధర్మాన్ని ప్రశంసిస్తారు. లోకంలో ఎన్నో ధర్మాలు ఉండవచ్చు ; ఉన్నాయి కూడా. కాని హిందూ ధర్మం ఒక ప్రత్యేకత కలిగి ఉంది. అది చారిత్రకంగా అన్నింటికన్నా ప్రాచీనం. దాని మొదలును ఎవరూ చెప్పలేరు. అంతాన్ని కూడా ఎవరూ ఊహించలేరు. అందుకే దానిని "సనాతన ధర్మం" అన్నారు.



అంటే "ఎల్లప్పుడూ ఉండే ధర్మం" అని అర్థం. "ఆర్షధర్మం అనీ, ఆర్యధర్మం" అనీ దీనికి మారుపేర్లు. ఋషులు బోధించిన ధర్మం, గుణవంతుల ధర్మం అని భావం. "హీనం దూషయతి హిందుః" "దోషాన్ని నిరసించేవాడు హిందువు" అని హిందూ శబ్దానికి నిర్వచనం. సత్యం, సహనం, శాంతం, శీలం, నిగ్రహం దీని ముఖ్యలక్షణాలు.

ఈ ధర్మానికి ప్రవక్త ఎవరూ లేరు. వేదాలు దీనికి పరమమూలం. అవి స్వయంప్రకాశాలు. స్వయం ప్రమాణాలు. వేదాలవల్ల రూపొందిన స్మృతులూ, శాస్త్రాలూ, ఇతిహాసాలూ, పురాణాలూ, సాహిత్యమూ, కళలూ, శిష్టాచారాలూ ఇవన్నీ హిందూధర్మం యొక్క వివిధ రూపాలే.

భారతదేశంలో అనాదిగా ఈ ధర్మప్రవాహం ప్రవహిస్తున్నది– ప్రవహిస్తుంది. అయితే చారిత్రకంగాను, దైవికంగాను కొన్ని సంఘటనలు జరుగుతాయి. చరిత్రగమనంలో హిందూధర్మానికి కూడా కొన్ని అఘాతాలు కలిగాయి. కొన్ని పెద్దవీ, కొన్ని చిన్నవీ

దెబ్బలు తగిలాయి. కానీ అవి తాత్కాలికాలు. సూర్యుణ్ణి మేఘాలు కప్పడం వంటివి. ఆ అడ్డంకులను తొలగించుకుంటే మరల మన ధర్మం గొప్పగా ప్రకాశిస్తుంది. ఆర్షధర్మం మహాసముద్రం వంటిది. అది మహాగంభీరం – ప్రశాంతం. గడ్డలను, నదులను, మహానదులను తనలో కలిపేసుకుంటుంది. తాను నిశ్చలంగా ఉంటుంది. కాగా దేశీయాలు, విదేశీయాలూ, ఎన్నో ధర్మప్రవాహాలు ఇందులో కలిసిపోయాయి. ఆర్యధర్మం అందరకు అనుకూలం. సర్వసమ్మతమైన లక్షణాలు దానికున్నట్లు మరి ఏ ధర్మానికీ లేవు.

చారిత్రకంగా క్రీస్తుశకం పన్నెండు పదమూడు శతాబ్దాలలో హిందూధర్మానికి గట్టిదెబ్బ తగిలింది. అది తురుష్కుల వల్ల తగిలింది. వారు పైదేశం నుండి వచ్చి విరచుకుపడ్డారు. భారత దేశంలో సామ్రాజ్యం స్థాపించారు. సాహసంతో, పట్టుదలతో, వెర్రి ఆవేశంతో వారి మతాన్ని ఈ దేశంలో సుప్రతిష్ఠితం చెయ్యడమే వారి ముఖ్యలక్ష్యం. ఈ దేశీయులను వారి దాసులుగా చేసుకోవడమే వారి ధ్యేయం. ఈ రెండు కారణాలతోను తురుష్కులు



చేసిన దుష్కృత్యాలు ఇన్నీ అన్నీ కావు. హిందూరాజ్యాలు కూలిపోయాయి. పట్టణాలు నేలమట్టమయ్యాయి. దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. వెండి బంగారాలూ, మణిమాణిక్యాలు, ఆస్తిపాస్తులూ–సర్వస్వం దోచుకోబడ్డాయి. హింసాకాండ మిన్నుముట్టింది. మతగ్రంథాలు బూడిదయ్యాయి. మానభంగాలకు, ప్రాణభంగాలకు లెక్కే లేదు.

ఈ తీరులో ఉత్తరభారతాన్ని ఉక్కిరి బిక్కిరి చేసి, మహమ్మదీయులు తమ గుప్పెట్లో పెట్టుకోవడం జరిగింది.

క్రమంగా దక్షిణ భారతదేశం మీద కూడ వారి చూపు పడింది. ఇక్కడ కూడా అవే అకృత్యాలు తాండవం చేసాయి. కొంతకాలం పాటు వరంగల్లుకోట వాటిని ఆపగలిగింది. కాకతీయ చక్రవర్తులు ధైర్య సాహసాలతో తురకల దుండగాలను ఎదుర్కొన్నారు. కాని చివరకు వారు కూడా "దాసోఽహమ్" అయిపోవలసి వచ్చింది. పెనుగాలికి పెద్దచెట్టు కూడా ఫెళ ఫెళమని



విరిగిపడిపోతుంది గదా! కాకతీయ సామ్రాజ్యం కకావికలయింది. హిందూ సామంతులు చెల్లాచెదురు అయిపోయారు. చెట్టుకొకరు పుట్టకొకరుగా తలదాచుకున్నారు. చిన్న చిన్న రాజ్యాలు స్థాపించుకున్నారు. నాయక రాజ్యాలు, రెడ్డిరాజ్యాలు పద్మనాయకరాజ్యాలుగా కొన్ని రాజ్యాలు మొలకెత్తాయి. అన్నీ కలసి హిందూధర్మాన్ని సంరక్షించాలని తీర్మానించుకున్నాయి.

అయినా అది సాధ్యం కాలేదు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ, ఘియాసుద్దీన్ తుగ్లక్, మహమ్మద్–బీన్ తుగ్లక్ మొదలయిన చండప్రచండ తురుష్కుల సైన్యాలు ఉప్పెనలా వచ్చి అన్నింటినీ ముంచివేయడం ప్రారంభించాయి. హిందూరాజులలో ఐకమత్యం కూడా కరువైపోయింది. పరస్పరం కీచులాడుకున్నారు. పిట్టా పిట్టా తగవు పిల్లి తీర్చిన చందం ఏర్పడింది. చిన్న చిన్న హిందూరాజ్యాలు తురకలకు "గుటకాయ స్వాహా" అయిపోయాయి. హిందూరాజులు అంతరిస్తున్నారు. హిందూ దేవాలయాలు మట్టికలిసిపోతున్నాయి. హిందూమతగ్రంథాలు కొన ఊపిరితో మిగిలాయి. హిందూధర్మం



సుతరామూ తుడిచిపెట్టుకుపోతుందా – అనిపించింది. ఈ విధంగా దక్షిణభారతం అట్టుడికినట్లు ఉడికిపోవడం ఆరంభించింది.

ఇటువంటి అవస్థలో కావలసింది ఏమిటి? ఆర్షధర్మానికి అండదండలు కావాలి. ఆశ్రయం కావాలి. ఆవాసం కావాలి. భద్రపీఠం ఉండాలి. సంరక్షకులు ఉండాలి. సంఘటన ఏర్పడాలి. ప్రజలలో చైతన్యం కలగాలి. నిర్భయత్వం నిలదొక్కుకోవాలి. పునరుజ్జీవనం కలిగించాలి. అట్టి స్థితి ఏర్పడిందా?

భగవంతుని దయవల్ల ఏర్పడింది. ధర్మానికి పీడకలిగి అధర్మం విజృంభిస్తున్న ఆ యా సమయాలలో శిష్టులను రక్షించడానికి తానే అవతారం ఎత్తుతానని భగవంతుడే ప్రతిజ్ఞ చేశాడు. ధర్మాన్ని సుప్రతిష్ఠితం చేస్తానని శపథం చేశాడు.

**"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్॥**

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥**

అని ప్రసిద్ధమైన శ్రీకృష్ణపరమాత్మ మాటలకు భావం ఇదే. అవసరం బట్టి ఒకప్పుడు పెద్ద అవతారాలు, మరొకప్పుడు చిన్న అవతారాలు వస్తూ ఉంటాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలయిన వారు అవతారపురుషులు. శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలయిన వారు చిన్న అవతారాలు. ఘనకార్యాలు చేసిన మహాపురుషులందరూ భగవానుని అంశలే.

ఈ తీరులో క్రీస్తుశకం పధ్నాలుగవ శతాబ్దం ఆరంభంలో హిందూధర్మాన్ని మళ్ళీ ఉజ్జీవింపచేయటానికి, సుప్రతిష్ఠితం చేయడానికిన్ని కొందరు మహాపురుషులు దక్షిణ భారత దేశంలో ఆవిర్భవించారు. ఒక మహాసామ్రాజ్యాన్ని స్థాపించారు. హరిహర రాయలు, బుక్కరాయలు, కంపన అనేవారు మహాపురుషులు. వీరు తెలుగు వారు, సోదరులు. సంగమరాజుకుమారులు. హరిహర రాయలు, బుక్కరాయలున్ను విజయ నగర మహాసామ్రాజ్యాన్ని



స్థాపించారు. కంపన వారిద్దరికీ అండదండగా ఉంటూ ఉదయగిరి ప్రాంతానికి రాజప్రతినిధిగా ఉండేవాడు.

విజయనగర రాజ్యస్థాపన బహుచిత్రంగా జరిగింది. హరిహరుడు, బుక్కరాయలున్ను మొదట ఓరుగల్లులో రెండవ ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉండేవారు. క్రీస్తుశకం 1323 సంవత్సరంలో మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రతాపరుద్రుని రాజ్యాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. అంతటితో కాకతీయరాజ్యం నామరూపాలు లేకుండాపోయింది. అప్పుడు బుక్క, హరిహరులు "కంపిలి" అనే చిన్నరాజ్యానికి చేరుకుని ఆ రాజు కొలువు కుదుర్చుకున్నారు. కొంతకాలానికి తుగ్లక్ కంపిలిని కూడా జయించి బుక్కహరిహరులను బందీలుగా ఢిల్లీకి పట్టుకుపోయాడు. చేసేది లేక వారిద్దరు తుగ్లక్ మంచిని సంపాదిస్తూ ఢిల్లీలో ఒకటి రెండు సంవత్సరాలుండవలసి వచ్చింది. ఆ సమయంలో కంపిలి మొదలయిన ప్రాంతాలలో తుగ్లక్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. వాటిని అణచడానికి అతడు



బుక్కహరిహరుల్నే పురమాయించాడు. ఒక షరతు కూడా పెట్టాడు. "వారు మహమ్మదీయ మతం పుచ్చుకోవాలి. దక్షిణంలో రాజప్రతినిధులుగా వ్యవహరిస్తూ తన మతాన్ని, రాజ్యాన్ని విస్తరింపచేయాలి. అలా చేస్తే వారికి సకల సదుపాయాలూ సమకూరుతాయి." సమయంకోసం చూస్తున్న ఆ అన్నదమ్ములకు మంచి అదను దొరికింది.

అన్ని షరతులకు ఒప్పుకున్నారు. తమ ప్రాంతానికి వచ్చి వీరవిహారం చేశారు. వారి మనస్సు ఉడికిపోతూఉంది. మాయచేసి అయినా తుగ్లకు దెబ్బకు దెబ్బ తీయాలి. అదే రాజనీతిసారం. బుక్కహరిహరులు వీరాధివీరులు, అరిభయంకరులు. కంపిలి ప్రాంతంలో అల్లరులను అణచివేశారు. నాడు ఆ ప్రాంతంలో మహానుభావులుగా వాసికెక్కిన విద్యారణ్యస్వామిని తమ గురువుగా ఎంచుకుని శరణు పొందారు. ఆయన మహాతపస్వి, యతీంద్రుడు. వీరి గుణగణాలను చూసి ముచ్చటపడి వీరిని మరల హిందూమతంలోకి చేర్చుకున్నారు. హిందూధర్మాన్ని ఉద్ధరించమని



ప్రోత్సహించి ఆశీర్వదించారు. స్వామి ఆశీర్వాద బలంతో సోదరులిద్దరు హోయసలరాజు మూడవ బల్లాలుని రాజ్యంలో కొంతభాగం ఆక్రమించుకున్నారు. తమ రాజ్యాన్ని కొత్తగా స్థాపించుకున్నారు. మీసాలు మెలివేసి జబ్బలు చరిచి "మేము స్వతంత్రులం. ఈ రాజ్యం మాది. ఇది హిందూ సామ్రాజ్యం. ఇటుపైన మీ పప్పులు ఇక్కడ ఉడకవు. ఖబర్దార్" అని తుగ్లకునకు వర్తమానం పంపించారు. అతడు పాపం గుడ్లుతేలవేశాడు. నోట మాట లేదు. తోక ముడిచివేశాడు. ఈ విధంగా బుక్కహరిహరులు దక్షిణ భారతంలో సముజ్జ్వలమైన ఒక హిందూ రాజ్యానికి నాంది పలికారు.

తరువాత నూతన సామ్రాజ్యానికి రాజధానికోసం ప్రయత్నం ప్రారంభమైంది. ఇలా ఉండగా ఒకనాడు ఒక అద్భుతం జరిగింది. అన్నదమ్ములిద్దరూ తుంగభద్రానది యొక్క దక్షిణం ఒడ్డున అడవిలో వినోదంగా వేటాడుతున్నారు. ఒకచోట ఉన్నట్లుండి



హఠాత్తుగా చెవులపిల్లి వేటకుక్కపై తిరగబడింది. దాని ధాటికి తట్టుకోలేక సింహంలాంటి కుక్క తోక ముడిచి పారిపోయింది. సోదరుల ఆశ్చర్యానికి అంతే లేకపోయింది. వేట చాలించి ఇంటికి వచ్చి వారు విద్యారణ్యులవారికి ఈ వింతను విన్నవించారు. వారు దివ్యదృష్టితో విషయం తెలుసుకొని చిరునవ్వుతో "వీరవరులారా! ఆ ప్రదేశం సిద్ధిక్షేత్రం – వీరస్థానం. అక్కడ మీరు రాజధాని నిర్మించుకోవడం చాలా మంచిది. ఆ నగరం చిరకాలం సకల సంపదలతో తులతూగుతుంది" అని చెప్పారు. రాజధానికై చేసిన ప్రయత్నాలు దైవవశాన సుఖంగా ఫలించాయి.

విద్యారణ్యులవారే స్వయంగా రాజధానికి శంకుస్థాపన చేశారు. క్రీస్తుశకం 1336 సంవత్సరంలో లోకోత్తరమైన మహానగరం సిద్ధమైంది. అదే విద్యానగరం, విజయనగరం. విద్యారణ్యస్వామి స్మృతి చిహ్నం. హిందూ ధర్మలక్ష్మికి కళ్యాణమందిరం.



విజయనగరం వైభవం వర్ణించడానికి మహాకవుల మాటలే చాలవు. కళ్ళారాచూసి మురిసిపోయిన విదేశీయాత్రికులు ఆ నగర వైభవాన్ని వేయివిధాల పొగిడారు. "లోకంలో కనీ వినీ ఎరుగనంత సుందరనగరమ"ని ఒకరన్నారు. "అక్కడి దేవాలయాలు సాక్షాత్తు దేవుళ్ళకు నిలయాల" ని ఇంకొకరు అన్నారు. "బజారులు బారులు తీర్చి విశాలంగా ఉన్నాయని, ముత్యాలు, మణులు, మాణిక్యాలున్ను కుప్పలు కుప్పలుగా బజారుల్లో కనిపించాయనీ" మరొకరు చెప్పారు. నగరం చుట్టూ ఏడు ప్రాకారాలుండేవట. సరస్సులు, ఉద్యానవనాలు, విహారభూములు కొల్లలుగా ఉండేవట. ప్రపంచంలో సకల సదుపాయాలూ గల నగరం, విజయనగరం ఒక్కటేనట. రాజభవనాలు సాక్షాత్తూ ఇంద్రభవనాలేనట. అక్కడ వాడుకలో ఉన్న పాత్రసామగ్రి అంతా వెండి బంగారాల మయమేనట. అన్ని విద్యలకు, కళలకు ఆ పట్టణం ఆలవాలమేనట. కాగా విజయనగరం ఆనాడు భూలోకస్వర్గమై వెలిగిందన్నమాట.



బుక్కరాయలు, హరిహరరాయలు విజయనగరానికి రాజధానిని మార్చుకొన్నారు. క్రమంగా సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకొన్నారు. సుభిక్షం రాజ్యమంతటా నాట్యం చేస్తోంది. ప్రజలు హాయిగా బ్రతుకుతున్నారు. శత్రుభయం లేదు. ఒకవంక తమ సోదరుడు కంపన రాజప్రతినిధిగా రాజ్యాన్ని బలపరుస్తున్నాడు. ఇక కావలసిందేమి?

అందువల్ల రాయప్రభువుల దృష్టి ధర్మం వైపు మళ్ళింది. ఆర్షధర్మాన్ని ప్రచారం చెయ్యాలి. సనాతన ధర్మానికి పట్టం కట్టాలి. శిష్టాచారాన్ని నిలబెట్టాలి. తురకలవల్ల తగిలిన గాయం మాసిపోవాలి. హిందూ సమాజం సంఘటితం కావాలి. అది పూర్తిగా పునరుజ్జీవితం కావాలి. ఇవీ ప్రభువుల గట్టి ఆదర్శాలు. వాటిని ఆచరణలో పెట్టేందుకు వారు దృఢంగా సంకల్పించారు.

వెంటనే రాయచక్రవర్తులు సంకల్పసిద్ధులయ్యారు. కృతకృత్యులయ్యారు. కావలసిన పరికరం అంతా వారికి సిద్ధంగానే అమరింది. అదే దైవసంకల్పం! అదే వేద ధర్మానికి పట్టిన అదృష్టం!

ఆనాడు విజయనగర చక్రవర్తులకు మహామంత్రులుగా ఇద్దరు మహామనీషులున్నారు. మాధవాచార్యులు, సాయణా చార్యులు అని వారి పవిత్ర నామధేయాలు. మాధవాచార్యులు పెద్దవాడు. తరువాత సాయణుడు. వారిద్దరు అన్నదమ్ములు. వీరికి తమ్ముడు భోగనాథుడు. వీరి తండ్రి మాయణుడు, తల్లి శ్రీమతి. వీరు బ్రాహ్మణోత్తములు. భారద్వాజ గోత్రులు. సాంప్రదాయికంగా కృష్ణయజుర్వేదులు. ముగ్గురున్ను విద్యాతీర్థులు, భారతీతీర్థులు, శ్రీకంఠులు అనే ముగ్గురు ఉద్దండ పండితుల వద్ద ఏకముఖంగానే విద్యాభ్యాసం చేశారు. అన్ని విద్యలందు ఆరితేరి దిగ్గజాలవలె తయారయ్యారు.

పెద్దన్న మాధవుడు బుక్క హరిహరులకు ముఖ్యమంత్రి అయ్యాడు. తన బుద్ధివైభవంతోను, పాండిత్యంతోను రాజ్యరథాన్ని సమర్థంగా నడిపాడు. మహారాజులకు కుడిభుజంగా ఉండేవాడు. ధర్మప్రచారంకోసం బాగా కృషి చేశాడు. పరాశరస్మృతికి వ్యాఖ్యానం రచించాడు. అదేగాక కాలనిర్ణయం, జైమిని న్యాయమాల,



జీవన్ముక్తి వివేకం, పంచదశి మొదలయిన ఉద్గ్రంథాలను కూడా రచించి గొప్ప కీర్తిని గడించాడు.

చిన్న తమ్ముడు భోగనాథుడు సంస్కృతంలో గొప్పకవి. రామోల్లాసం, త్రిపురవిజయం, ఉదాహరణమాల, మహాగణపతిస్తవం, శృంగారమంజరి మొదలయిన కావ్యాలను రచించి పేరు పొందాడు. కొంతకాలం కంపనరాజు కుమారుడైన రెండవ సంగమరాజుకు ఇతడు నర్మసచివుడుగా ఉండేవాడట.

మధ్యవాడు సాయణాచార్యులు. ఇతడే మన కథా నాయకుడు. ఇతడు లోకోత్తరమైన వ్యక్తి. ఒక వంక మహాపండితుడు, మహాతత్త్వవేత్త, మహాచార్యుడు. వేదాలు, వేదాంతాలు, శాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు అన్నీ పూర్తిగా పుక్కిటబట్టినవాడు. వేరొకవంక శుక్రునీ బృహస్పతినీ మించిన మహా రాజనీతివేత్త. మతిచాతుర్యంతో విజయనగర సామ్రాజ్య వికాసానికి తన శాయశక్తులా పనిచేశాడు. మరొకవంక మహాయోధుడు –



మహాపరాక్రమవంతుడు – మహాబలశాలి. అవసరమైనప్పుడు కత్తిచేతపట్టి "ఇదం బ్రాహ్మమ్–ఇదం క్షాత్రమ్" (ఇదుగో! ఇది బ్రహ్మతేజస్సు – ఇది క్షత్రియ తేజస్సు) అని పరశురామునిలాగ శపథం పట్టినవాడు. సమరంలో శత్రువులను ఊచకోత కోసినవాడు. సాయణుడంటే నాటి రాజమదగజాలకు సింహస్వప్నమే.

కొంతమందికి పాండిత్యం మాత్రమే ఉంటుంది. పరాక్రమం ఉండదు. మరికొంతమందికి పరాక్రమం మాత్రమే ఉంటుంది. పాండిత్యం ఉండదు. ఇంకొంతమందికి రెండూ ఉన్నా పరిపాలన సామర్థ్యం సున్నా అవుతుంది. అది ఉన్నచోట మీది రెండూ పూజ్యం అవుతాయి. అన్నీ అమరితే కొన్ని చోట్ల శీలం ఉండదు. పరాక్రమం, పాండిత్యం, పరిపాలనదక్షత, పాటవం, సచ్ఛీలం – ఇన్ని గుణాలు ఒక వ్యక్తిలో సమకూరడం చాలా అరుదు. అందుకే "గుణాలన్నీ ఒక దగ్గర ఉండవు. అలా ఉండటం



సృష్టికర్తకు ఇష్టమైన విషయం కాదు." అని కాళిదాస మహాకవి అన్నాడు. (ప్రాయేణ సామగ్ర్య విధౌ గుణానాం పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః) కాని సాయణునియందు అపురూపమైన అమలగుణసంపద అమరింది. అది ఆర్షధర్మం చేసుకొన్న అదృష్టం. ఆత్మరక్షణకోసం ఆ ధర్మదేవతే సాయణుడుగా అవతరించిందేమో!

సాయణుడు చిన్నతనంలో కంపరాయల మంత్రిగా ఉండేవాడు. కంపరాయలు (లేక కంపన) హరిహరరాయలకు బుక్కరాయలకు తమ్ముడనీ విజయనగర సామ్రాజ్యం తూర్పుభాగంలో ఉదయగిరిలో రాజప్రతినిధిగా ఉండేవాడని ఇదివరకు అనుకొన్నాం గదా! కంపన చనిపోయేసరికి అతని కుమారుడు రెండవ సంగముడు చాలా చిన్నవాడు. అందువల్ల అతని పేరుతో సాయణుడే రాజకార్యాలన్నీ చక్కబెట్టేవాడు. సంగమునకు గురువు కూడా అయి విద్యలన్నీ నేర్పాడు. యుక్తవయసు రాగానే అతనికి రాజ్యాన్ని అప్పగించాడు. ఒకప్పుడు

సంగమునితో చోళదేశం మీదికి దండెత్తి వెళ్ళి జయించి ఆ దేశాన్ని తమ రాజ్యంలో భాగంగా చేశాడు. మరొక సమయంలో గరుడనగరాన్ని ముట్టడించి స్వాధీనం చేసుకున్నాడు. ఈ తీరులో సాయణుడు విజయనగర వైభవాన్ని తీర్చిదిద్దాడు. సాయణుని పరాక్రమాన్ని చిన్న శ్లోకం ఇలా చెపుతుంది :-

**జగద్వీరస్య జాగర్తి కృపాణః సాయణ ప్రభోః।**
**కిమిత్యేతే వృథాటోపా గర్జంతి పరిపంథినః॥**

(సాయణుడు లోకైక వీరుడు. అతని కత్తికి అడ్డులేదు. దానిముందు శత్రువుల పెడబొబ్బలు వ్యర్థం)
ఇంకొక శ్లోకం అతని పరిపాలనా పాటవాన్ని చాటుతుంది :-

**సత్యం మహీం భవతి శాసతి సాయణార్యే।**
**సంప్రాప్త భోగ సుఖినః సకలాశ్చ లోకాః॥**

(సాయణుని పాలనలో జనులంతా సుఖభోగాలతో తులతూగేవారు)



రెండవ సంగమరాయలను పెద్దవానిని చేసి, అతనికి రాజ్యాన్ని అప్పగించిన కొంతకాలానికి సాయణాచార్యులు రాజధానికే వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది. విజయనగరంలోనే మంత్రిపుంగవుడుగా మెలగవలసిన వీలు చిక్కింది. అన్న మాధవాచార్యులతో కలసి పీఠాన్ని అధిష్ఠించవలసిన సమయం వచ్చింది. రాజాధిరాజు బుక్కరాయలుకు, అతని తరువాత అతని కుమారుడు రెండవ హరిహరరాయలకు ఆస్థాన విద్వాంసుడుగా వాసికెక్కవలసిన ముహూర్తం కుదిరింది.

అది శుభముహూర్తం, ధర్మముహూర్తం, కళ్యాణ ముహూర్తం. ఆ ముహూర్తంలో –"బుక్కమహీపతిః ఆది శన్మాధవాచార్యం వేదార్థస్య ప్రకాశనే" – బుక్కరాయలు వేదాలకు వ్యాఖ్యానం రచించమని మాధవాచార్యులను కోరాడు. మాధవుడు కొంచెం ఆలోచించాడు : "తానూ గొప్ప పండితుడే, సమర్థుడే. ఆ యా సమయాలలో గొప్ప గ్రంథాలను ఎన్నింటినో రచించినవాడే. కాని ప్రస్తుతం తీరిక లేదు. రాజకార్యాలు బోలెడన్ని ఉన్నాయి. మహామంత్రిగా ఉన్నందువల్ల వేదవ్యాఖ్య రచించడానికి తగిన



ఏకాగ్రత కుదరదు. అందువల్ల సాయణాచార్యులకు ఈ పని అప్పగించడం మంచిది. అతన్ని విద్యానగరంలో ప్రతిష్ఠించడం కూడా సముచితం. ఇంతవరకు దూరంగా ఉండిపోయాడు. అతన్ని ఆస్థానానికి ఆహ్వానించి ఈ పని చేయించడం తక్షణ కర్తవ్యం.

ఇలాగ అనుకొని – "స ప్రాహ నృపతిం రాజన్ । సాయణార్యో మమానుజః। సర్వం వేత్త్యేష వేదానాం వ్యాఖ్యాతృత్వే నియుజ్యతామ్॥

"మహారాజా ! నా తమ్ముడు సాయణాచార్యులు తమకు తెలిసినవాడే. అతడు పండిత శిరోమణి. అతనికే వేదవ్యాఖ్యాన భారాన్ని అప్పగించడం మంచిది" అని చక్రవర్తితో విన్నవించుకొన్నాడు.

బుక్క మహీపతి అంగీకరించి వెంటనే సాయణుని విజయనగరానికి పిలిపించుకున్నాడు. ఆ విధంగా సాయణుడు విజయనగరం సంస్థానంలో అడుగు పెట్టడం, స్థిరపడటం



జరిగింది. అప్పటికి అతని వయస్సు ఇంచుమించు ఏభై సంవత్సరాలు కావచ్చు.

బుక్కరాయలు వేదార్థప్రకాశం చేయమనడానికి ముఖ్యకారణం ఇది:-

హిందూధర్మానికి కల్పవృక్షం వేదం. రాను రాను అది మూలమాత్రంగా మిగిలిపోయి, దాని అర్థం ఎవరికీ తెలియకుండా పోతోంది. అదీగాక తురుష్కుల విజృంభణ వల్ల దేశంలో ధర్మానికి దెబ్బతగులుతోంది. కాగా మూలకందమైన వేదార్థం బాగా ప్రచారం కావాలి. అలా అయిననాడే ఇతిహాస పురాణాదులకు కూడా మంచి బలం కలుగుతుంది. మంచి సమర్థుడైన వాడే వేదాలకు వ్యాఖ్య రచించాలి – అని. సమర్థుడు సాయణాచార్యులు లభించాడు. ఇంతకు అసలు వేదం అంటే ఏమిటి? మానవునికి కావలసిన ఇహపర ధర్మాలన్నీ తెలియజేసే గ్రంథం వేదం. దానిని మహర్షులు లోకంలో ప్రవర్తింపజేశారు. అది అనాదిగా భారతదేశపు ఉత్తమ సంపదగా పరిగణించబడుతున్నది.

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అని ముఖ్యంగా వేదాలు నాలుగు. బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు అన్నవి వేదంలోని భాగాలే. అవి వేదాలకు వ్యాఖ్యల వంటివి. అందులోను ఉపనిషత్తులు పరమాత్మ తత్త్వాన్ని బోధించే గ్రంథాలు. వీటినే "వేదాంతం" అంటారు. ఋగ్వేదం ఛందోబద్ధమై ఉంది. అంటే అందులోని మంత్రాలు పద్యాలలాగా ఒకానొక ఛందస్సుకు లొంగిఉంటాయి. యజుర్వేదంలోని మంత్రాలు పద్యరూపంగాను, గద్యరూపంగాను కూడా ఉంటాయి. సామవేద మంత్రాలను సంగీతంతో పాడతారు. అథర్వ వేదం కూడా గద్యపద్య రూపంతో ఉంది. ఇందులోని మంత్రాలు అనేక రోగాలను పోగొట్టడానికి, గొప్పగొప్ప శక్తులను సంపాదించడానికీ ఉపయోగిస్తాయి.

వేదాలలో ముఖ్యంగా రెండు భాగాలున్నాయి – పూర్వభాగం, ఉత్తరభాగం అని వాటికి పేర్లు. పూర్వభాగం అంతా యజ్ఞయాగాలకు సంబంధించింది. ఉత్తరభాగం కేవలం



ఆత్మతత్త్వానికి చెందింది. పూర్వభాగానికి "పూర్వ మీమాంస"లేక "ధర్మమీమాంస" అనీ, ఉత్తర భాగానికి "ఉత్తరమీమాంస" లేక "బ్రహ్మమీమాంస" అనీ సంప్రదాయంగా వస్తున్న నామధేయాలు. ఒక విషయాన్ని క్షుణ్ణంగా చర్చించి, నిర్ణయాలు చెప్పే పద్ధతి "మీమాంస" అంటారు.

యజ్ఞం అన్నా యాగం అన్నా దేవతలను సంతోషపెట్టి, శ్రేయస్సులను పొందడానికి మానవులు ఆచరించే ఒక విధమైన కర్మ. వందలకొలది యజ్ఞాలను, వాటిని ఆచరించే పద్ధతులను యజుర్వేదం తెలియజేస్తుంది. ఇంద్రుడు, అగ్ని, వరుణుడు మొదలయిన దేవతలను ఋగ్వేదమంత్రాలు అనేక విధాలుగా పొగడుతాయి. అవే మంత్రాలు సామవేదంలో సంగీతంతో కలిశాయి. అథర్వవేద మంత్రాలు కూడా చాలా వరకు యాగాలకు ఉపయోగిస్తాయి. యజ్ఞయాగాల ప్రసంగంలోను, తత్త్వప్రసంగంలోను వేలకొలది మానవ ధర్మాలను విశ్వకళ్యాణమైన ధర్మాలను వేదాలు బోధించాయి.



"అనంతాః వై వేదాః" అని ఆర్యుల వచనం. వేదాలకు లెక్క చూపడం బహు కష్టం" అని దాని తాత్పర్యం. అయినా వేదాలన్నీ కలిపి సుమారు ఇరవై వేల మంత్రాలు ఉంటాయని విమర్శకులు అంటారు.

ప్రతి యుగంలోను కలగాపులగంగా ఉన్న వేదాలను విశదంగా విభజించే ఒక మహానుభావుడు ఉదయిస్తూ ఉంటాడు. అలా విభజించే మహాపురుషుని "వేదవ్యాసుడు" అనడం ఆచారం. అదొక బిరుదు. ఈ కలియుగం ఆరంభంలో "కృష్ణద్వైపాయనుడు" (మహాభారతం మొదలయిన పురాణాలను రచించిన మహర్షి) వేదవ్యాసుడు అయినాడు.

ఇటువంటి వేదవాఙ్మయానికి భాష్యం వ్రాయడం అంటే ఎంత కష్టమో – సులువుగా ఊహించుకోవచ్చు. అది నక్షత్రాలను లెక్కపెట్టడం వంటిది. సముద్రానికి ఏతాము ఎత్తడం వంటిది. ఎంతో పాండిత్యం ఉండాలి. శిక్ష (వేద మంత్రాలను ఉచ్చరించే విధానం చెప్పే శాస్త్రం) వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం (వేద



శబ్దాల వ్యుత్పత్తిని, అర్థాలను చెప్పే గ్రంథం). జ్యోతిషం, కల్పం (యజ్ఞయాగాదులను చేసే విధానాలను చూపే శాస్త్రం) అన్న ఆరు వేదాంగాలూ పూర్తిగా తెలియాలి. తర్కశాస్త్రం, ధర్మశాస్త్రం, పురాణాలూ– అన్నీ అధీనంలో ఉండాలి. సంప్రదాయం తెలిసి ఉండాలి. ఇంద్రియ నిగ్రహం కావాలి. అన్నింటినీ మించి బుద్ధికుశలత, సమన్వయ శక్తీ ఉండాలి.

పూర్వజన్మసుకృతంవల్ల సాయణునికి పైన చెప్పిన లక్షణాలన్నీ ఉన్నాయి. అందుకే "వేదార్థప్రకాశం" అనే లక్ష్మి ఆయనను స్వయంగా వరించింది. అందుకే ఆయనకు "ఆచార్య" బిరుదం దక్కింది. ప్రతివాడూ ఆచార్యుడు కాలేడు – కాకూడదు కూడా. శాస్త్రసారం ఒంటబట్టినవాడు ఆచార్యుడు. సకల శాస్త్రాలను శిష్యులకు బోధించగలిగినవాడు ఆచార్యుడు. ధర్మమార్గంలో సంచరించేవాడు ఆచార్యుడు. ఆదర్శపురుషుడు ఆచార్యుడు. "ఆచార్య బిరుదం సాయణునికి సార్థకమైనట్లు నాటికీ, నేటికీ కూడా ఇంకొకరికి సార్థకం కాదేమో!

బుక్కరాయుని ఆదేశంతోను, మాధవాచార్యుల ఆశీర్వాదబలంతోను శుభముహూర్తాన సాయణాచార్యులు వేదభాష్య రచనకు ఉపక్రమించి, ఇంచుమించు పది సంవత్సరాలలో భాష్యాలను పూర్తి కావించాడు. తన భాష్యాలకు "వేదార్థప్రకాశం" అనే సముచితమైన పేరు పెట్టాడు. అన్నగారియందుండే ప్రేమవల్ల గౌరవం వల్లను "మాధవీయం" అనే మరో మంచి పేరును కూడా వాటికి పెట్టాడు. అన్నదమ్ములిద్దరికీ అభేదం అని సూచించడానికి ప్రతిచోటా "సాయణమాధవ" అనే పదాన్నే వాడుకున్నాడు.

సాయణాచార్యులు వ్రాసిన వేదభాష్యాల వరస ఈవిధంగా ఉంటుంది:-

**(అ) సంహితలు (మూలభాగాలు) :-**

1. ఋగ్వేద సంహిత
2. తైత్తిరీయ సంహిత (కృష్ణయజుర్వేదం)
3. కాణ్వసంహిత (శుక్లయజుర్వేదం)



4. సామవేద సంహిత
5. అథర్వవేద సంహిత

**(ఆ) బ్రాహ్మణాలు - ఆరణ్యకాలు:-**

1. తైత్తిరీయ బ్రాహ్మణం } కృష్ణయజుర్వేదం
2. తైత్తిరీయారణ్యకం } కృష్ణయజుర్వేదం
3. ఐతరేయ బ్రాహ్మణం } ఋగ్వేదం
4. ఐతరేయారణ్యకం } ఋగ్వేదం
5. తాండ్య బ్రాహ్మణం
6. షడ్వింశ బ్రాహ్మణం
7. సామవిధాన బ్రాహ్మణం
8. ఆర్షేయ బ్రాహ్మణం
9. దేవతాధ్యాయ బ్రాహ్మణం
10. ఉపనిషద్ బ్రాహ్మణం
11. సంహితోపనిషద్ బ్రాహ్మణం
12. వంశ బ్రాహ్మణం

(5–12: సామవేదం)



13. శతపథ బ్రాహ్మణం - శుక్లయజుర్వేదం

సాయణుడు ఇతర శాస్త్రాలలో కూడా గట్టివాడు. అందుచేతనే ధర్మశాస్త్రం, వ్యాకరణం, అలంకారం మొదలయిన శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలను కూడా కొన్నింటిని రచించాడు. అవి మిక్కిలి ప్రామాణికంగా పరిగణింప బడుతున్నాయి. వాటిలో :-

**1. ప్రాయశ్చిత్త సుధానిధి :-** ఇది ధర్మశాస్త్ర గ్రంథం. కర్మలను ఆచరించేటప్పుడు సహజంగా కొన్ని పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. వాటిని సర్దుబాటు చేసుకొనే విధానాన్ని ప్రాయశ్చిత్తం అంటారు. అటువంటి ప్రాయశ్చిత్తాలను ఇది వివరిస్తుంది.

**2. ధాతువృత్తి :-** వ్యాకరణ శాస్త్ర గ్రంథం. సంస్కృత భాషలోని ధాతువులకు సంబంధించిన విషయాలన్నీ ఇందులో ఉన్నాయి.



సాయణుని అన్నగారి పేరుతో "మాధవీయ ధాతువృత్తి" అని ప్రచారంలోకి వచ్చింది.

**3. అలంకార సుధానిధి :-** ఉపమ, రూపకం మొదలయిన అలంకారాలను విశదీకరిస్తుంది. ఇందులోని ఉదాహరణ శ్లోకాలన్నీ సాయణాచార్యుల జీవితానికి సంబంధించినవే. ఇదొక విశేషం - విచిత్రం !

ఈ మూడు గ్రంథాలను కంపరాయల కుమారుడైన రెండవ సంగముని కాలంలో సాయణుడు రచించినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

**4. సుభాషిత సుధానిధి :-** నీతిని, నియమాన్ని, సదాచారాన్ని బోధించే మంచి మాటలను సుభాషితాలంటారు. సంస్కృత వాఙ్మయంలో ఉన్న చాలా సుభాషితాలు ఇందులో చోటు

చేసుకున్నాయి. సాయణుడు కంపరాయల సమయంలో దీన్ని కూర్చాడనీ, ఈ గ్రంథమే అతని మొదటి రచన అనీ విమర్శకులంటారు.

**5. పురుషార్థ సుధానిధి :-** ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు పురుషార్థాలకు సంబంధించిన పురాణ శ్లోకాలన్నీ ఇందులో ఒకచోట కూర్చబడ్డాయి. బుక్కరాయల కాలంలోనే దీని రచన జరిగినట్లు తెలుస్తున్నది.

**6. ఆయుర్వేద సుధానిధి :-** ఇది వైద్య గ్రంథం.

**7. యజ్ఞతంత్ర సుధానిధి :-** యజ్ఞయాగాదులను ఆచరించే విధానాలను సమగ్రంగా చర్చిస్తుంది. ఇది శ్రౌత గ్రంథం.



పై రెండు గ్రంథాలను సాయణాచార్యుడు బుక్కరాయల కుమారుడైన రెండవ హరిహరరాయల కాలంలో రచించినట్లు సాక్ష్యాలున్నాయి.

సాయణాచార్యుల నిత్యజీవనం కూడా ఒడుదొడుకులు ఏమీ లేకుండా సాఫీగా నడిచిపోయింది. పవిత్రమైన, ప్రశాంతమైన, ఉదారమైన, గంభీరమైన సంపూర్ణ జీవితాన్ని ఆయన అనుభవించాడు. సాయణుని కుమారులు ముగ్గురు. కంపన, మాయణ, సింగన అని వారి పేర్లు. వారు కూడా తండ్రి కళ్ళ ఎదుటనే పెరిగి పెద్దవారై మహాపండితులు, మహాకవులూ అయినందువల్ల సాయణుని ఆనందానికి అవధులు ఉండేవి కావు. అటువంటి సార్థక జీవితాన్ని అనుభవించి, "శతాయుః పురుషః" అనిపించుకొని, రెండవ హరిహరరాయల కాలంలో క్రీస్తుశకం 1387 వ



సంవత్సరంలో సాయణాచార్యులు బ్రహ్మసాయుజ్యాన్ని పొందాడని (మరణించాడని) చరిత్ర చెపుతుంది.

ఈ విధంగా వరుసగా నలుగురు రారాజుల ఆదరం పొందడం, మహాపండితుడుగా, మహామంత్రిగా, మహా రాజనీతివేత్తగా, మహాగ్రంథ రచయితగాను ప్రఖ్యాతిని పొందడం, ఆర్షధర్మోద్ధారకుడు కావడం, పరిపూర్ణ జీవితాన్ని అనుభవించడం ఎవరికీ ఒక్కసారి లభించవు. ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క మహాపురుషునికే లభిస్తాయి. అటువంటి మహాపురుషుల్లో సాయణాచార్యులు ఒకరు.

వేదాలు ఉన్నంతవరకూ సాయణాచార్యుల కీర్తి పతాకం ఎగురుతూనే ఉంటుంది. హిందూ ధర్మం నిలిచినంత వరకూ సాయణాచార్యుల గ్రంథాలు ప్రకాశిస్తూనే ఉంటాయి. సనాతనధర్మం



ఉన్నంతవరకూ సాయణాచార్యుల పవిత్రనామధేయం ఆర్యుల చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అదే మహాపురుషుల అదృష్టం!

"నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయమ్"
(మహాపురుషుల కీర్తికి ముసలితనమూ, మృత్యువూ అంటూ ఉండవు).

